క్లుప్తంగా

ఆర్ఆర్‌డీఎస్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, భీమవరం: స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు, నాలుగేళ్ల డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశముంటుందని 26 నుంచి 30 వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చునన్నారు. నూతన విద్యావిధానంలో బీఏ ఎకనామిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రధాన సబ్జెక్ట్స్‌గా ఉంటాయని ఎకనామిక్స్, హిస్టరీ, ఫిజిక్స్ మైనర్ సబ్జెక్ట్స్‌గా ఎంచుకోవాలని నాలుగేళ్ల డిగ్రీ చేసిన విద్యార్థులు పీజీలో రెండవ సంవత్సరంలో చేరవచ్చునని ప్రసూన వివరించారు.

పారదర్శకంగా రెవెన్యూ సేవలు ఇవ్వాలి



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజుతో తహసీల్దార్ నడింపల్లి భారతీ విజయ లక్ష్మి

ఆకివీడు: రెవెన్యూ సేవలు పారదర్శకంగా ఉండే విధంగా కృషి చేయాలని తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నడింపల్లి భారతీ విజయలక్ష్మికి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు సూచించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె శుక్రవారం మర్యాద పూర్వకంగా పీవీఎల్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ప్రజలకు మెరుగైన సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

మాస శివరాత్రి పూజలు



ఆలయంలో మాస శివరాత్రి పూజలు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో మార్కండేయేశ్వరుడ్ని, రాజరాజేశ్వరికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గొంట్లా గణపతి, కార్యదర్శి కాకర్ల రాజ రాజేశ్వరి, అర్చకులు పూజలు చేశారు.

రేపు వీఎస్‌కే కళాశాలలో స్కాలర్‌షిప్ టెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న పట్టాభిరామయ్య

సాక్షి, భీమవరం: స్థానిక వీఎస్‌కే డిగ్రీ కళాశాలలో ఆదివారం ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వబిలిశెట్టి పట్టాభిరామయ్య తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిభ వంతులు, పేద విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో స్కాలర్ షిప్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రూ. 3 లక్షలు అందించనున్నామన్నారు. ప్రిన్సిపల్ ఏబీ రమణ మాట్లాడుతూ స్కాలర్ షిప్ టెస్ట్ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామని ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వర్షాలు కురవాలని విరాటపర్వం పారాయణం



మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో విరాట పర్వం పారాయణం చేస్తున్న అర్చకులు

భీమవరం(ప్రకాశం చౌక్): వేసవి తాపం తగ్గి వర్షాలు కురవాలని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆలయ అర్చకులు విరాటపర్వం పారాయణం చేశారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ యర్రం శెట్టి భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

పాలకోడేరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని యోగా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నాడు కుముదవల్లి హైస్కూల్‌లో యోగా గురించి వివరించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకోడేరు ప్రకృతిశాల వైద్యుడు సంగెల సృజన పాల్గొని విద్యార్థులకు ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహారపు అలవాట్లు గురించి అవగాహన కల్పించారు.

ఇక ఇంటికే పౌష్టికాహారం

- అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేత
- జూలై 1 నుంచి అమలు
- నెలలో రెండు విడతలుగా అందించేందుకు ప్రణాళికలు



మండలంలో గర్భిణులు, బాలింతలు పోషకాహార కిట్లు తీసుకుంటున్న దృశ్యం



అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులు భోజనం చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్త హీనతను అధిగమించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుంది. డాక్టర్ వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ పథకాల ద్వారా పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వీరవాసరం, భీమవరం అర్బన్, భీమవరం రూరల్ పరిధిలో 192 అంగన్ వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు 1191, బాలింతలు 1127 పౌష్టికాహారాన్ని పొందుతున్నారు. అదేవిధంగా చిన్నారులు కూడా పౌష్టికాహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉండి కేంద్రాలకు వెళ్లి పోషణ కిట్లు తీసుకునేందుకు, అక్కడ భోజనం చేసేందుకు గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు తలెత్తడంతో గుర్తించిన ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో జూలై 1 నుంచి గర్భిణులు, బాలింతలు ఇళ్లకే పౌష్టికాహారం పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో వారిలో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి.

గర్భిణులు, బాలింతలు ఇంటికే పౌష్టికాహారం

ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలకు అటుకులు కిలో, రాగిపిండి కిలో, జొన్నపిండి కిలో, కంది పప్పు కిలో, బియ్యం 3 కిలోలు, బెల్లం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు, ఎండు ఖర్జూరం 250 గ్రామలు, నూనె 500 లీటరు, గుడ్లు 25, పాలు 5 లీటర్లు పోషణ కిట్లు అంగన్ వాడీ కేంద్రాల వద్ద ఇస్తున్నారు. అయితే భోజనం చేయడానికి మాత్రం అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కారణాల రీత్యా రాలేకపోతున్నారు.దీంతో జూలై 1 నుంచే పౌష్టికాహారాన్ని ఇళ్లకే పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కరోనా సమయంలో అమలు

కరోనా సమయంలో రెండేళ్ల పాటు టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) విధానం ద్వారా లబ్ధిదారులకు సరుకులు ఇళ్లకే పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు మళ్లీ తెరవడం గర్భిణులు, బాలింతలకు నెలలు నిండటం, ఆరోగ్య సమస్యలు చిన్నారుల సంరక్షణ వంటి కారణాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఆహారం, పోషకాహార సరుకులు తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో జూలై 1 నుంచి ఇళ్లకే పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

జూలై 1 నుంచి అమలు



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం జూలై 1 నుంచి సరుకుల రూపంలో లబ్ధిదారుల ఇళ్లకే ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నెలలో 1 నుంచి 5 వరకు మొదట విడత, 15, 16 తేదీలలో రెండు విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం అందిస్తాం.

– టీకేవీ లక్ష్మీకాంతం, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ, భీమవరం

ఆక్వా సాగుకు భూసార పరీక్షలు చాలా అవసరం

ఉండి: ఆక్వా సాగు చేపట్టేందుకు అయినా భూసార పరీక్షలు చాలా అవసరమని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లిఖార్జునరావు తెలిపారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, పరీక్షల నిర్వహణ తీరుతెన్నులపై పత్రికా ప్రకటన ద్వారా పలు విషయాలు తెలిపారు. ప్రతి రైతు తాము పండించే పంటలో నష్టపోకుండా కనీస లాభాలు సాధించేందుకు పంట పండిస్తున్న నేల స్వభావాన్ని తప్పకుండా తెలుసుకోవాలన్నారు. లేకుంటే సాంప్రదాయ పద్ధతుల్లో సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మట్టి పరీక్షల వల్ల భూసారం, కావలసిన ఎరువుల మోతాదు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు తెలుస్తాయన్నారు. రైతులు కనీసం రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. మట్టి పరీక్షలను సరైన రీతిలో నిర్వహించేందుకు రైతులు ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంను సందర్శించాలని సూచించారు. మరిన్ని వివరాల కొరకు శాస్త్రవేత్తలు డాక్టర పీ వినయలక్ష్మి, డాక్టర్ ఏ శ్రీనివాసరావులను 9989623823 నంబర్ నందు సంప్రదించాలని మల్లిఖార్జునరావు సూచించారు.

ముత్యాలమ్మకు వెండి సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానానికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కంచర్ల వెంకటసూర్యనారాయణ –రత్న మునెమ్మ దంపతులు పావు కిలో వెండిని శుక్రవారం సమర్పించారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం ఈ వెండిని అందజేసినట్లు తెలిపారు. అలాగే ఉప్పాకపాడు గ్రామానికి చెందిన మారిశెట్టి వీరవెంకయ్య – జ్యోతి, అమ్మ మణి దంపతులు మరో 116 గ్రాముల వెండిని అందజేశారు.

డీఈఓకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి



డీఈఓ వెంకటరమణకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని అటువంటివాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖా కార్యాలయంలో డీఈవో ఆర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాం పేరుతో అధిక మొత్తం వసూలు చేస్తూ వ్యాపారం చేస్తున్నాయని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద డబ్బులు గుంజుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజులు, ఇతర ఖర్చుల పేరుతో పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యుడు బి.గణేష్ తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: రాయలం ప్రాంతానికి చెందిన వి.రామకృష్ణారావు (62) టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో పడిపోయాడని పోలీసులు తెలిపారు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. అనారోగ్య కారణలతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతుని భార్య వేంద్ర ఝాన్సీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమవరం: పాలకోడేరు మండలం వంకాయలపాలెం గ్రామానికి చెందిన పి.ఏసుబాబు (55) తను పండించిన ఆకుకూరలు విక్రయించేందుకు శుక్రవారం భీమవరం వస్తుండగా విస్సాకోడేరు వంతెన సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఏసుబాబును తోటి వ్యాపారులు భీమవరం ఆసుపత్రిలో చేర్పించగా మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని పోలీసులు తెలిపారు. ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను లబ్ధిదారులకు చేరువచేయడంలో చొరవ చూపాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ కోరారు. యలమంచిలి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మాతా సునీల్‌కుమార్ శుక్రవారం పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యలో రాణిస్తేనే మంచి భవిష్యత్



సీఎస్ఎన్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఆర్డీవో రాజు

సాక్షి, భీమవరం: విద్యలో రాణిస్తే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సమాజంలో మంచి గౌరవం లభిస్తుందని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. భీమవరం సీఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శ్రీ విజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో ఖర్చుకు వెనుకాడకుండా కళాశాలలకు పంపిస్తారని అన్నారు. విద్యార్థులు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తే తల్లిదండ్రుల తోపాటు చదువునేర్పిన గురువులు కళాశాల యాజమాన్యం ఎంతగానో ఆనందిస్తారన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ళ సత్యనారాయణ, విజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకట్రాజు, బొమ్మదేవర ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నందమూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఉచిత విద్యాబోధన



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రమణరాజు

సాక్షి, భీమవరం: పూర్తిగా అంధత్వం లేదా పాక్షిక అందత్వం కలిగిన విద్యార్థులకు ఉద్దరాజు వెంకటసుబ్బరాజు మెమోరియల్ కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న అంధుల పాఠశాలలో ఉచిత విద్యా బోధన కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని స్కూల్ నిర్వహకుడు డాక్టర్ యువీ రమణరాజు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2004 నుంచి తాను అంధుల కోసం ఉచిత పాఠశాలలను నిర్వహిస్తున్నామని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు నైపుణ్యం కలిగిన అధ్యాపక బృందంతో విద్యాబోధన చేస్తుండగా ఇక్కడ విద్యనభ్యసించిన అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని రమణరాజు చెప్పారు. 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన అర్హత కలిగిన విద్యార్థులు పాఠశాలలో చేరవచ్చునన్నారు. తమ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు దాతల సహకారంతో ప్రయాణ సౌకర్యంతోపాటు, మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. అడ్మిషన్ల వివరాల కోసం 08816 222383, 08816 222 444 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

సృష్టిని ఏలేది శివ శక్తులే



శివానందలహరి, సౌందర్యలహరి పారాయణం చేస్తున్న డాక్టర్ అనంతలక్ష్మి

ఆకివీడు: సృష్టిని ఏలేది శివ శక్తులేనని ఆది శంకరులవారు రచించిన శివానందలహరి, సౌందర్యలహరి స్పష్టం చేస్తున్నాయని ప్రముఖ ఆధ్యాత్మికరాలు డాక్టర్ అనంతలక్ష్మి చెప్పారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శివానందలహరి, సౌందర్యలహరి పారాయణం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పద్యరూపంలో ఉన్న వీటిని ఆమె పారాయణం చేశారు. విడదీయరాని సంబంధం ఉన్న ఇద్దరి పారమ్యాన్ని బోధించే రెండు స్తోత్రాలు రచించడం ద్వారా శంకరాచార్యులు భక్తిపారవశ్యాన్ని నింపారని చెప్పారు. సౌందర్యలహరిలో తంత్ర శాస్త్రానికి సంబంధించిన విషయాలు నిక్షిప్తమై ఉన్నాయని అనంతలక్ష్మి చెప్పారు. ఒక్కో శ్లోకం మహామంత్రమని వర్ణించారు. అనంతరం అనంతలక్ష్మిని ఆలయ మర్యాదలతో దేవస్థానం చైర్మన్ బొమ్మారెడ్డి మాధవరెడ్డి, పాలకవర్గం సత్కరించింది. పలువురు మహిళలు పారాయణంతో పరవశించారు. ఈ కార్యక్రమంలో వేదాంత భారతి సౌందర్య లహరి గ్రూప్ శృంగేరి శిష్య బృందం, హైదరాబాద్ వారు పాల్గొన్నారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెద అమీరం పంచాయితీలో డీపీఓ ను కలిసిన సర్పంచ్, ఉప సర్పంచ్‌లు

కాళ్ల: మండలంలోని పెదఅమీరం గ్రామంలో డీపీఓ జీకే మల్లికార్జునరావు శుక్రవారం పర్యటించారు. ముందుగా పంచాయతీని సందర్శించారు. అనంతరం గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డు ను పరిశీలించారు. డంపింగ్ యార్డ్లో చేస్తున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తడి చెత్త, పొడి చెత్త ఏ విధంగా వేరు చేసి వేస్తున్నారు దానిపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నారు అడిగి తెలుసుకున్నారు. ముందుగా గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో డిపిఓ మల్లికార్జున రావును గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్ పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి వెంట గ్రామ సెక్రటరీ పి కనకారావు, సచివాలయ సెక్రటరీ సత్యనారాయణ, సిబ్బంది, అధికారులు ఉన్నారు.

కౌలు కార్డుల మంజూరుకు సహకరించాలి



మేడపాడులో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి

యలమంచిలి: కౌలు కార్డులు మంజూరుకు సొంత భూమిని కౌలుకు ఇచ్చిన రైతులంతా సహకరించాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. మండలంలోని 23 రైతు భరోసా కేంద్రాలలో శుక్రవారం కౌలు కార్డులు మంజూరుపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించారు. మేడపాడు రైతు భరోసా కేంద్రంలో జరిగిన సమావేశంలో దేవి మాట్లాడుతూ తమ భూమిని కౌలుకు ఇచ్చిన చాలామంది రైతులు కౌలు రైతుకు కౌలు కార్డు మంజూరు చేయడానికి అనుమతి ఇవ్వడానికి సంకోచిస్తున్నారని చెప్పారు. కౌలు కార్డుకు కేవలం 11 నెలలు మాత్రమే కాల పరిమితి ఉంటుందన్నారు. అది కూడా కౌలుకు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతు తమ పంటకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రం ద్వారా పొందడానికి, పండించిన పంటను అమ్ముకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. కొంత మంది రైతులు కౌలు కార్డుకు అనుమతి ఇవ్వడం వలన భవిష్యత్‌లో తమకు ఇబ్బందులు వస్తాయని భావించి అనుమతి ఇవ్వడం లేదన్నారు. అలా చేయడం వల్ల సాగు చేస్తున్న కౌలు రైతులు ఇబ్బంది పడతారని, ఈ విషయంలో రైతులు సహకరించాలని ఆమె కోరారు. కౌలుకు భూమి సాగు చేస్తున్న కౌలు రైతులంతా సంబంధిత గ్రామ పరిధిలోని వీఆర్వోను కలిస్తే కౌలు రైతు దరఖాస్తు ఇస్తారని, సదరు దరఖాస్తు పూర్తి చేసి దానితోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు ఫోటో ఇస్తే కొత్త కౌలు కార్డు ఇస్తామని దేవి చెప్పారు. ఈ నెలాఖరులోపు కొత్త కౌలు కార్డులు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే రైతులంతా జూలై 10 లోపు నారుమడులు వేయడం పూర్తి చేయాలని ఆమె కోరారు. ఈ సార్వా పంటకు ఎంటీయూ–1064, ఎంటీయూ–1061, ఎంటీయూ–1318 విత్తనాలు అనుకూలంగా ఉంటాయని రైతులు వాటినే విత్తుకోవాలని ఆమె కోరారు. ఆలస్యంగా నారుమడులు వేసే రైతులు మాత్రం ఎంటీయూ–1318 రకం వేయాలని ఆమె కోరారు. ఈ విత్తనాలు నారు పోసిన 155 రోజులకే కోతకు వస్తాయని, కాబట్టి ఆలస్యంగా ఊడ్చే రైతులకు ఈ విత్తనాలు అనుకూలమన్నారు. విత్తనాలు అవసరమైన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి డబ్బులు చెల్లించాలని ఆమె కోరారు. ముందుగా డబ్బులు చెల్లించిన రైతులకు కిలో విత్తనాలకు రూ.5 సబ్సిడీ వస్తుందని ఆమె వివరించారు. ఈ సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

30న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: వాయిదా పడిన నరసాపురం న్యాయవాదుల సంఘం కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 30న నిర్వహిస్తోన్నట్టు ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, నిర్వహణ కమిటి సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి ఈ నెల 20న నామినేషన్లు స్వీకరించి, 21న నామినేషన్‌లు పరిశీలిస్తామని చెప్పారు. 22 నుంచి 24 వరకూ నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని చెప్పారు. 30వ తేదీ ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 4.30 గంటలు వరకూ పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్లు లెక్కిస్తామన్నారు.

సూర్యుడి భగభగలతో ఇక్కట్లు



పెనుగొండలో నిర్మానుష్యంగా మారిన రహదారి

పెనుగొండ: రోహిణీ కార్తె పూర్తి కావస్తున్నా సూర్యుడు భగభగలు తగ్గలేదు. ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత కొన సాగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతా పం చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమి తం అవుతున్నారు. రోహిణీ కార్తె అఖరులో నైనా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఎదురు చూపులు చూస్తున్నా వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. మిట్టమధ్యాహ్నమయ్యే సరికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసినా గంటలోనే నిండుకుంటున్నాయి. దుకాణదారులు 12 గంటలకు సర్దేసుకొని తిరిగి సాయంత్రం 5 గంటలకు గాని తెరవలేకపోతున్నారు. ఎండతాకిడికి తోడు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో తొలకరి చినుకులు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

ఘనంగా ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపోలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి హాజరై ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన కండక్టర్లు, డ్రైవర్లు డీఎస్‌రావు, కేవీ రత్నంలను అభినందించి, వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. వీరయ్య చౌదరి మాట్లాడుతూ హైదరాబాద్ రూట్‌లో ప్రవేశపెట్టిన ఇంద్ర ఏసీ, ఆచంట రూట్‌లో అదనపు బస్సులను ప్రజాదారణ పొందేలా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, గేరేజి, ట్రాఫిక్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

డ్రై డేతో దోమల నివారణ

తణుకు అర్బన్: వారానికి ఒకసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని వెంకటరాయపురం సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో ఉండే చిన్న నీటి నిల్వలు దోమల పుట్టుకకు ప్రధాన కారకాలని అన్నారు. నీటిని నిల్వచేసే వాటిపై తప్పని సరిగా మూతలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఫైలేరియా బాధితులకు మార్బ్ డిటీ మేనేజ్‌మెంట్ డిజబిలిటీ ప్రీవెన్షన్ కిట్స్ అందజేశారు. వెక్టార్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫైలేరియా యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ సెక్రటరీ డి.మంజుల, శానిటేషన్ సెక్రటరీ రాజు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ పాల్గొన్నారు.